వచ్చే మూడురోజులు వానలు

- కొన్నిచోట్ల పిడుగులు పడొచ్చు
- తెలుగు రాష్ట్రాల్లో ఆవర్తన ద్రోణి
- పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్, ఎల్లో, గ్రీన్ అలెర్ట్‌ల జారీ

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మంగళవారం ఉదయం నుంచి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమైంది. కొన్ని జిల్లాల్లో అకాల వర్షాలతో వాతావరణం చల్లబడింది. తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. వచ్చే మూడు రోజులు మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని చోట్ల పిడుగులు పడవచ్చని పేర్కొన్నది. ఇప్పటికే తెలంగాణలోని అనేక జిల్లాల్లో అకాల వర్షాలు అన్నదాతలకు నష్టాలను తెచ్చిపెట్టాయి. కామారెడ్డి జిల్లాలో పలుచోట్ల మంగళవారం వడగండ్ల పడటంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రాష్ట్రంలోని కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ రంగారెడ్డి జిల్లాలకు ఎల్లో అలర్ట్, మిగిలిన జిల్లాలకు వాతావరణశాఖ గ్రీన్ అలర్ట్ జారీచేసింది. హైదరాబాద్‌లో ఇప్పటికే పలుచోట్ల వర్షం కురుస్తున్నది. దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, సరూర్‌నగర్, కర్మన్‌ఘాట్‌లో చిరుజల్లులు పడ్డాయి.

ఒడిశా మీదుగా కోస్తాంధ్ర వరకు ద్రోణి

ఏపీలో కూడా వాతావరణం చల్లబడే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ అంచనా వేసింది. జార్ఖండ్ నుంచి ఒడిశా మీదుగా ఉత్తర కోస్తాంధ్ర వరకు ఆవర్తన ద్రోణి కొనసాగుతున్నదని, దీని ప్రభావంతో కోస్తాంధ్రలో బుధవారం వర్షాలు పడే అవకాశం ఉన్నదని తెలిపింది. కిందిస్థాయి గాలులు దక్షిణ ఆగ్నేయ దిశ నుంచి రాష్ట్రం వైపు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. పశ్చిమ విదర్భ దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్న ఉపరితల ఆవర్తనం బుధవారం అదే ప్రాంతంలో కొనసాగుతుందని వాతావరణ కేంద్రం సంచాలకులు తెలిపారు. ఏపీలోని పలు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు, మిగిలినచోట్ల తేలికపాటి వానలు పడే అవకాశం ఉన్నట్టు అంచనా వేసింది. మొత్తంగా ఏపీలోని 19 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ అయ్యింది.

రాజన్న జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు

100 కోట్ల పంట నష్టం

మొదటిపేజీ తరువాయి...

తీసింది. శనివారం నుంచి సోమవారం వరకు కురిసిన వానలకు సుమారు 50 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా అంచనా వేసినట్టు తెలిసింది. మంగళవారం కూడా సిద్దిపేట, సిరిసిల్లతోపాటు ఇతర జిల్లాల్లోనూ భారీగా వడగండ్ల వానలు పడ్డాయి. పంట నష్టం మరింత పెరిగే అవకాశం ఉన్నది. ముఖ్యంగా నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, సిరిసిల్ల, సిద్దిపేట, సంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీగా పంటలు దెబ్బతిన్నట్టు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. దెబ్బతిన్న పంటల్లో వరి 30 వేల ఎకరాలు ఉండగా మామిడి, ఇతర కూరగాయలు, ఉద్యాన పంటలు కలిపి మరో 20 వేల ఎకరాల వరకు ఉండొచ్చని అంచనా వేశారు. ఇక 50 వేల ఎకరాల్లో పంట నష్టం జరగ్గా.. దీని విలువ రూ.100 కోట్లకుపైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. వరి, మక్కజొన్న, ఇతర ఉద్యాన పంటలకు రైతులు పెట్టిన పెట్టుబడి ఆధారంగా పంట నష్టం అంచనా వేశారు.

ప్రభుత్వ భరోసా కరువు

అకాల వర్షాలతో పుట్టెడు దు:ఖంలో ఉన్న రైతులకు ప్రభుత్వం నుంచి భరోసా కరువైంది. పంట నష్టపోయిన రైతులను కనీసం పరామర్శించే దిక్కు లేకుండా పోయింది. మంత్రులుగానీ ఎమ్మెల్యేలుగానీ రైతులను పరామర్శించిన పాపానపోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిరుడు మార్చి, ఏప్రిల్ నెలలో ఇదే మాదిరిగా వడగండ్ల వర్షాలు కురిశాయి. మార్చి వర్షాలకు 1.51 లక్షల ఎకరాల్లో, ఏప్రిల్ వర్షాలకు 3.04 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు భరోసా కల్పించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి అక్కడికక్కడే నష్టపరిహారాన్ని ప్రకటించారు. ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారాన్ని అందించాలని ఆదేశించారు. ఇందుకోసం రూ.456 కోట్లు విడుదల చేసిన అప్పటి ప్రభుత్వం.. రైతులకు పరిహారాన్ని అందించి కష్టకాలంలో అండగా నిలిచింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు ఆ పరామర్శలకు, భరోసాకు నోచుకోవడం లేదు. అయితే, పంటనష్టం పూర్తిగా అంచనా వేసిన తర్వాత పరిహారం ఇవ్వాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. గతంలో మాదిరిగానే ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలని భావిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పరిహారాన్ని ప్రకటించొచ్చా లేక ఎన్నికల సంఘం అనుమతి తీసుకోవాల్సి ఉంటుందా అనే అంశంపై చర్చిస్తున్నట్టు తెలిసింది. అయితే, దీనిపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి గానీ, వ్యవసాయశాఖ నుంచి ఎలాంటి ప్రకటనలు వెలువడలేదు.

రైతులూ జాగ్రత్తగా ఉండండి: మంత్రి తుమ్మల

మరో మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచించారు. ఇప్పటికే రెండు మూడు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్నట్టు తెలిసిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రైతుల జాగ్రత్తగా ఉండాలని కోరారు. అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని, వర్షాల సమయంలో రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆదేశించారు. మార్కెట్‌కు తీసుకొచ్చిన పంటలు వర్షాలకు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

అన్నదాత కష్టం.. నీటిపాలు

- వడగండ్లు, ఈదురుగాలులు..
- ఆదిలాబాద్ జిల్లాలో 900 ఎకరాల్లో దెబ్బ తిన్న పంటలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో పలుచోట్ల నేల కూలిన చెట్లు
- పంటలను పరిశీలించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ)/సిద్దిపేట: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం సాయంత్రం కురిసిన ఈదురుగాలులతో కూలిన వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. రైతులకు తీరని నష్టం మిగిల్చింది. ఆదిలాబాద్ జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షంతో జొన్న, మక్క, నువ్వు, పొగాకు, కంది పంటలకు నష్టం వాటిల్లింది. వందలాది ఎకరాల్లో జొన్న పంటల నేలకొరిగింది. 900 ఎకరాల్లో రైతులు పంటలను నష్టపోయినట్టు ప్రాథమిక అంచనా వేశామని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య తెలిపారు. ఇంద్రవెల్లిలో ఓ జిన్నింగ్ మిల్లులో రైతులు ఆరబెట్టిన మక్కపంట వర్షానికి తడిసిముద్దయింది. తలమడుగు మండలంలో దెబ్బతిన్న పంటలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు. ప్రభుత్వం రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

మెదక్ జిల్లా రామాయంపేట మండలం సుతారిపల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

ఉమ్మడి మెదక్ జిల్లాలో గాలివాన దుమారం

ఉమ్మడి మెదక్ జిల్లాలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో వడగండ్ల వాన పడింది. సిద్దిపేటతోపాటు నియోజకవర్గంలోని చిన్నకోడూరు, సిద్దిపేట అర్బన్, రూరల్ మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. సిద్దిపేటతోపాటు పలు గ్రామాల్లో చోట్లు నేలకూలాయి. చిన్నకోడూరు మండలంలోని చంద్లాపూర్, పెద్దకోడూరులో మామిడి, మక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం జరిగింది. స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. చిన్నశంకరంపేట, రామాయంపేట, చేగుంట, నిజాంపేట, నార్సింగ్, తూప్రాన్ మండలాల్లో వడగండ్ల వానకు పంటలు నేలకొరిగాయి. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, నారాయణఖేడ్, న్యాల్‌కల్, ఝరాసంగం, మొగుడంపల్లి, మనూరు, కంగ్టి, హత్నూర మండలాల్లో వడగండ్ల వాన కురిసింది. సంగారెడ్డి జిల్లాలో 714 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

నష్టపరిహారం పదివేలు ఇవ్వాలి

- వడగండ్లతో రైతులకు కన్నీళ్లు
- హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఎక్స్ వేదికగా కోరారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి తదితర జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన అన్నదాతను అతలాకుతలం చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. పంటలు చేతికొచ్చే సమయంలో వడగండ్ల వాన రైతులకు కన్నీరు మిగిల్చిందని పేర్కొన్నారు. వరి, మక్కజొన్న, జొన్న పంటలతోపాటు బొప్పాయి, మామిడి సహా ఇతర ఉద్యాన పంటలు దెబ్బతినడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. గతంలో అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోతే, అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా వెళ్లి రైతులను పరామర్శించి భరోసా కల్పించి, అక్కడికక్కడే ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం ప్రకటించి అమలు చేశారని గుర్తుచేశారు. రెండు, మూడు రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. రాజకీయాలు తప్ప, రైతు ప్రయోజనాలు పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని అన్నదాతకు అండగా నిలవాలని హితవు చెప్పారు. పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయడంతోపాటు ఎకరాకు రూ.10 వేల నష్ట పరిహారం చెల్లించాలని బీఆర్‌ఎస్ డిమాండ్ చేస్తున్నదని తెలిపారు.

అన్నదాతలను ఆదుకోవాలి

- ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలి
- మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి
- వడగండ్ల వానకు దెబ్బ తిన్న పంటలను పరిశీలించిన బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

సిరిసిల్ల టౌన్/ముస్తాబాద్, మార్చి 19: వడగండ్ల వానతో పంట నష్టపోయిన అన్నదాతలకు ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల చొప్పన పరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ముస్తాబాద్, పోతుగల్, సేవాలాల్ తండా, గన్నెవానిపల్లెలో పంటలను పరిశీలించి, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముస్తాబాద్‌లో విద్యుత్తు స్తంభం కూలి రైతు ఎల్లాని ఎల్లయ్య చనిపోయిన ప్రాంతాన్ని వినోద్‌కుమార్ పరిశీలించారు. అనంతరం ఎల్లయ్య ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం మృతుడి కుటుంబానికి తక్షణమే రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లాకేంద్రంలోని తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. దెబ్బతిన్న పంటలను తక్షణమే సర్వే చేయించి, రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతిని ఫోన్ ద్వారా కోరారు. వరి పంటలు పొట్ట దశలో ఉన్నాయని, ప్రభుత్వం విద్యుత్తు కోతలు లేకుండా సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ జనగామ శరత్‌రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలి దుమారానికి ఎగిరిపోయిన చిన్నారి

మొదటిపేజీ తరువాయి...

తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. నానమ్మతో ఉన్న సంగీత, సీత ఇంట్లో రేకులకు ఉయ్యాల కట్టుకుని ఆడారు. కొద్దిసేపటికి నానమ్మ, సీత ఇద్దరూ పక్కింట్లోకి వెళ్లారు. తర్వాత కొద్దిసేపటికే భారీగా సుడిగాలి వీచింది. రేకులతోపాటు చిన్నారి సంగీత ఎగిరిపోయి రెండు ఇండ్ల తర్వాత ఉన్న స్లాబ్‌పై పడింది. గమనించిన ఇరుగుపొరుగు వారు గాయాలతో కొట్టుమిట్టాడుతున్న సంగీతను 108లో నర్సాపూర్ దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం చిన్నారి సంగీత మరణించింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబాన్ని నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు.

చెట్టుకొమ్మ విరిగిపడి టెన్త్ విద్యార్థి మృతి

చెట్టుకొమ్మ విరిగిపడి మృతిచెందిన వెంకటేశ్ (ఫైల్)

సిద్దిపేట, మార్చి 19: బలమైన ఈదురుగాలులకు చెట్టుకొమ్మ విరిగిపడి టెన్త్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాద ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని కొల్గూర్‌లో మంగళవారం సాయంత్రం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన మన్నె రేణుక చంద్రయ్య దంపతుల రెండో కుమారుడు వెంకటేశ్ మండలంలోని అహ్మదీపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం పదో తరగతి హిందీ పరీక్ష రాసి ఇంటికొచ్చాడు. సాయంత్రం పొలం వద్ద ఉన్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లిన వెంకటేశ్ పశువులను తోలుకుంటూ ఇంటి కొస్తున్న సమయంలో ఈదురుగాలుల వానకు రోడ్డు వెంట ఉన్న చెట్టుకొమ్మ విరిగి వెంకటేశ్ మీద పడింది. ఒక్కసారిగా అతడు సీసీరోడ్డుపై పడి ప్రాణాలు వదిలాడు. తల్లిదండ్రులు తన అన్నతో కలిసి పొలం నుంచి బైక్‌పై ఇంటికొచ్చారు. వారి వెనకాలనే పశువులను తొలుకుంటూ ఇంటికి మరో ఐదు నిమిషాల్లో చేరుతాడనుకొనేలోపే వెంకటేశ్ చనిపోవడం ఆ కుటుంబంలో తీరని విషాదం నింపింది.

పంట పరిహారంపై రోడ్డెక్కిన రైతన్న

అకాల వర్షానికి దెబ్బ తిన్న పంటలు

భిక్కనూరు, మార్చి 19: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని అన్నదాతలు రోడ్డెక్కారు. మంగళవారం భిక్కనూరు మండలం అంతంపల్లి శివారులో 44వ జాతీయ రహదారిపై బైఠాయించారు. రాస్తారోకోతో రెండు వైపులా నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. నాలుగు రోజుల క్రితం కురిసిన వడగండ్ల వానతో కామారెడ్డి జిల్లాలో 20 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, ఆరుగాలం కష్టపడి, లక్షలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలను కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజులవుతున్నా అధికారులు ఒక్కరు రాలేదని, నష్టమెంత జరిగిందో లెక్క తీయడం లేదని మండిపడ్డారు. ఏడీఏ అపర్ణ, వ్యవసాయశాఖ అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకుని రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక పంపామని అధికారులు తెలుపగా, పొలాల్లోకి రాకుండానే నివేదిక ఇలా తయారుచేశారని రైతులు ప్రశ్నించారు. పరిహారం ప్రకటించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. డీఎస్పీ నాగేశ్వర్‌రావు వచ్చి సముదాయించడంతో రైతులు శాంతించారు. రేపటిలోగా పరిహారం ప్రకటించాలని, లేకపోతే గురువారం కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

రిజర్వాయర్లలో వేసవికి సరిపడా నీళ్లు

- సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని రిజర్వాయర్లలో సరిపడా నీళ్లు ఉన్నాయని, వేసవికాలంలో తాగునీటి అవసరాలకు ఇబ్బందులు ఉండవని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి స్పష్టం చేశారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితులు, పదోతరగతి పరీక్షల నిర్వహణ తీరుపై ఆమె సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాను నిర్విరామంగా కొనసాగించాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్‌లోనూ సరిపడా నీటిని అందిస్తున్నామని చెప్పారు. అనంతరం ఆమె పదో తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంటర్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించడం పట్ల కలెక్టర్లు, అధికారులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో పదో తరగతి పరీక్షలను నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీజీపీ రవిగుప్తా, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, కమిషనర్ దేవసేన, మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

- జార్ఖండ్ గవర్నర్‌కు తెలంగాణ రాష్ట్ర అదనపు బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- నేడు రాజ్‌భవన్‌లో గవర్నర్‌గా బాధ్యతల స్వీకరణ
- ఈయన కూడా గతంలో బీజేపీ తమిళనాడు అధ్యక్షుడే

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర నూతన గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ నియమితులయ్యారు. తమిళిసై సౌందరరాజన్ రాజీనామాతో జార్ఖండ్ గవర్నర్‌గా ఉన్న రాధాకృష్ణన్‌కు తెలంగాణ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా ఆయనకే అదనపు బాధ్యతలను అప్పగించారు. బుధవారం ఉదయం రాధాకృష్ణన్ తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. మంగళవారం రాత్రి 8.20కి జార్ఖండ్ నుంచి బయల్దేరి రాత్రి 11.05 గంటలకు రాజ్‌భవన్‌కు చేరుకోనున్నారు. బుధవారం రాజ్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే.. గవర్నర్‌గా రాధాకృష్ణన్‌తో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

తాజా, మాజీలు ఇద్దరూ తమిళనాడు బీజేపీ అధ్యక్షులే

మాజీ గవర్నర్ తమిళిసై, ప్రస్తుత గవర్నర్ రాధాకృష్ణన్ మధ్య పలు అంశాల్లో సారూప్యత ఉన్నది. ఈ ఇద్దరు కూడా తమిళనాడుకు చెందిన వారే. ఇద్దరూ తమిళనాడు బీజేపీలో కీలక నేతలే. ఆరెస్సెస్ భావజాలం కలిగిన రాధాకృష్ణన్ రాష్ట్ర బీజేపీలో కీలక నేతగా ఎదిగారు. 1998, 1999లో కోయంబత్తూర్ నుంచి ఎంపీగానూ గెలుపొందారు. ఆ తర్వాత 2004, 2014, 2019లో ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2004 నుంచి 2007 వరకు బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించారు. తమిళిసై కూడా 2014 నుంచి 2019 వరకు బీజేపీ తమిళనాడు అధ్యక్షురాలిగా కొనసాగడం గమనార్హం.



వైభవంగా దివ్య విమాన రథోత్సవం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కల్యాణ లక్ష్మీనరసింహుడు దివ్య విమానరథంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టువస్త్రాలు, బంగారు, వెండి, ముత్యాల ఆభరణాలతో కల్యాణ దంపతులైన లక్ష్మి, నరసింహస్వామిని దివ్య మనోహరంగా అలంకరించి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. – యాదగిరిగుట్ట

పోలీస్ కస్టడీని రద్దు చేయండి

- ప్రణీత్‌రావు లంచ్ మోషన్ పిటిషన్
- పోలీసుల వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ వ్యవహారంలో తనను పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ కింది కోర్టు జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) డీఎస్పీ దుగ్యాల ప్రణీతకుమార్ అలియాస్ ప్రణీత్‌రావు హైకోర్టును కోరారు. వాస్తవ అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా కింది కోర్టు తనను పోలీస్ కస్టడీకి అప్పగించిందని, నిర్దిష్టమైన షరతులేమీ విధించకుండానే కస్టడీ ఉత్తర్వులు జారీచేసిందని వివరిస్తూ మంగళవారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. స్పష్టమైన గడువు నిర్ణయించకుండా పోలీస్ కస్టడీకి ఇవ్వడం చెల్లదని పేర్కొన్నారు. కస్టడీ ఉత్తర్వులు లోపభూయిష్టంగా ఉన్నాయని, సుప్రీం కోర్టు జారీచేసిన మార్గదర్శకాలను అమలు చేయలేదని తెలిపారు. వాస్తవానికి ఈ నెల 18 (సోమవారం) నుంచి తనను పోలీస్ కస్టడీకి అప్పగించాల్సి ఉన్నప్పటికీ కింది కోర్టు 17 నుంచే కస్టడీకి అనుమతించిందని వివరించారు. రహస్యమంటూ పోలీసులు తనను బంజారాహిల్స్ స్టేషన్‌లో విచారిస్తున్నారని, ఈ విచారణకు తన బంధువులను, న్యాయవాదిని అనుమతించడం లేదని, దర్యాప్తు అంశాలను ఉద్దేశపూర్వకంగా మీడియాకు లీక్ చేసి తన పరువుకు భంగం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. పోలీసుల కస్టడీ, దర్యాప్తు నిర్దిష్ట ప్రదేశంలో జరిగేలా చూడాలని, రోజూ పోలీసుల విచారణ పూర్తవగానే తనను తిరిగి జైలుకు తరలించేలా ఉత్తర్వులు ఇవ్వాలని, ఇంటరాగేషన్‌లో ఏఎస్పీ డీ రమేశ్ పాల్గొనకుండా కట్టడి చేయాలని కోరారు. దీంతో ఈ అత్యవసర పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని జస్టిస్ జీ రాధారాణి పోలీసులను ఆదేశించారు. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

సెలబ్రిటీ రిసార్ట్ కాల్పుల కేసు సీఐడీకి..

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : సంచలనం సృష్టించిన సెలబ్రిటీ రిసార్ట్ కాల్పుల కేసులో కొత్త కోణం వెలుగు చూసింది. సొంత కూతురినే కిడ్నాప్ చేసేందుకు తన మాజీ భర్త సిద్ధార్థ్ దాస్ ప్రయత్నించారని ఆయన మాజీ భార్య స్మిత మంగళవారం డీజీపీ రవిగుప్తాకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు విచారణ చేపట్టాలని సీఐడీ ఏడీజీ శిఖాగోయెల్‌ను డీజీపీ రవిగుప్తా ఆదేశించారు. 2003లో పెళ్లి చేసుకున్న సిద్ధార్థ్–స్మిత 2019 నుంచి విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. కూకట్‌పల్లి ఫ్యామిలీ కోర్టులో విడాకులకు స్మిత పిటిషన్ వేశారు. వీరికి ఓ కొడుకు, కూతురు ఉన్నారు. స్మిత సీరియల్ యాక్టర్ మనోజ్‌తో కలిసి ఉంటుందని అప్పట్లో వార్తలు వచ్చాయి. వీరిద్దరు కలిసి పలువురు అమ్మాయిలకు సినిమా, సీరియల్ అవకాశాలు ఇస్తామని చెప్పి మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. సెలబ్రిటీ రిసార్టులోని ఓ విల్లాలో ఉంటున్నప్పుడు మనోజ్ తనను వేధిస్తున్నాడని సిద్ధార్థ్ కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై మాట్లాడేందుకు వెళ్లిన సిద్ధార్థ్‌దాస్‌పై ఎయిర్ గన్‌తో మనోజ్ కాల్పులు జరిపారు. అయితే తాజాగా సిద్ధార్థ్ దాస్ స్నేహితుడు అడ్వకేట్ అలీ తన కూతురిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని స్మిత డీజీపీకి ఫిర్యాదు చేసింది. కూతుర్ని కిడ్నాప్ చేయడానికి సిద్ధార్థ్ ప్రయత్నించాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నది.

మరో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

మలక్‌పేట, మార్చి 19: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఆటో డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీసింది. ఆటో గిరాకీలపై ప్రభావం చూపింది. ఆటోడ్రైవర్లు కిస్తీలు చెల్లించలేక కుటుంబపోషణ భారమై మనస్తాపాలకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక తాజాగా హైదరాబాద్‌లో మరో ఆటోడ్రైవర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మలక్‌పేట ఠాణా పరిధి అఫ్జల్‌నగర్‌లోని బంజారాబస్తీలో చోటుచేసుకున్నది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. బంజారాబస్తీకి చెందిన రాత్లావత్ లక్ష్మణ్‌కు ఇద్దరు కుమారులు, కూతురు. ముగ్గురికీ వివాహాలు కావడంతో ఎవరి బతుకువారు బతుకుతున్నారు. పెద్ద కొడుకు రాత్లావత్ గణేశ్ మార్కెటింగ్‌తో, చిన్న కుమారుడు రమేశ్ ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రమేశ్‌కు 2017లో సరిత తో పెండ్లి జరిగింది. ఇద్దరు బిడ్డలు జన్మించారు. పెద్దమ్మాయి ఎల్‌కేజీ, చిన్నమ్మాయి నర్సరీ చదువుతున్నారు.

కరోనాతో తల్లి.. ఇప్పుడు తండ్రి

2020లో కరోనా బారినపడి సరిత చనిపోవటంతో గత సెప్టెంబర్‌లో కర్ణాటకకు చెందిన ప్రియను రమేశ్ రెండో వివాహం చేసుకున్నాడు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోకు గిరాకీ తగ్గటంతో రమేశ్ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. సకాలంలో ఆటో ఫైనాన్స్ కిస్తీలు చెల్లించకపోవటంతో నాలుగు రోజుల క్రితం ఫైనాన్సర్లు ఆటోను లాక్కెళ్లి పోయారు. ఉన్న ఉపాధి కూడా పోవడంతో రమేశ్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం తాను పనికి వెళ్తున్నానని చెప్పి లంచ్‌బాక్స్ తీసుకొని వెళ్లిన రమేశ్.. రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చాడు. లంచ్‌బాక్స్ తినకుండా తీసుకురావటంతో బాధపడ్డ ప్రియ.. భోజనం వడ్డిస్తాననటంతో తనకు ఆకలిగా లేదని చెప్పాడు. ఎన్నిసార్లు బతిమలాడినా భోజనం చేయని రమేశ్.. తాను కాసేపు పడుకుంటానని, తనను లేపవద్దని భార్య ప్రియకు చెప్పి ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. ఉపాధి లేక, కుటుంబ పోషణ భారమవటంతో తీవ్ర మనస్తాపానికి గురై రమేశ్ చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఎంత పిలిచినా లోపలి నుంచి స్పందన రాకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. తీవ్ర ఆందోళనకు గురైన భార్య తలుపులను గట్టిగా బాదటంతో గడియ ఊడి తలుపులు తెరచుకున్నాయి. వెంటనే ఫ్యాన్‌కు వేసుకున్న చీరముడి విప్పిన ప్రియ రమేశ్‌ను నేలపై పడుకోబెట్టి ఇరుగుపొరుగువారిని పిలువగా, వారు చూసి అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. తల్లిదండ్రులు ఇద్దరు చనిపోవటంతో అనాథలైన ఇద్దరు చిన్నారులను గుండెలకు హత్తుకొని కుటుంబసభ్యులు రోదించటం పలువురిని కంటతడి పెట్టించింది.

సమన్వయం సాధ్యమేనా?

- ఎస్‌ఎస్‌ఏ ప్రాజెక్టుకు కొత్త డైరెక్టర్ నియామకం
- గతంలో విద్యాశాఖ కమిషనర్‌కే డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగింత
- తాజా నియామకంపై విద్యాశాఖ అదనపు డైరెక్టర్ల గుర్రు
- తాము ఉండగా మరొకరిని తీసుకురావడంపై విమర్శ

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : పాఠశాల విద్యాశాఖలో సంస్కరణలు చేపట్టాలన్న సర్కార్ ఆలోచన కొత్త సమస్యలు తెచ్చిపెట్టనుందా? గందరగోళంలోకి నెట్టనుందా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పాఠశాల విద్యాశాఖకు, సమగ్రశిక్ష ప్రాజెక్ట్ (ఎస్‌ఎస్‌ఏ)కు సమన్వయం బెడిసికొట్టే పరిస్థితి తలెత్తింది. ఎస్‌ఎస్‌ఏ కొత్త డైరెక్టర్‌ను నియమించడమే ఇందుకు కారణమన్న వాదనలున్నాయి. పాఠశాల విద్యాశాఖను గాడిలో పెట్టాలనుకొన్న ప్రభుత్వం ఇటీవలే పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి సమగ్రశిక్షను వేరుచేసింది. ఎస్‌ఎస్‌ఏకు నూతన ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా మల్లయ్య భట్టును నియమించింది. ఈ పరిణామం దేనికి దారితీస్తుందోనన్న వాదనలు విద్యాశాఖలో వినిపిస్తున్నాయి.

గతానికి భిన్నంగా..

సమగ్రశిక్ష ప్రాజెక్ట్ పాఠశాల విద్యాశాఖలో అంతర్భాగంగా ఉండేది. పదేండ్లుగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, కమిషనర్లే ఎస్‌ఎస్‌ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాధ్యతలను నిర్వర్తించేవారు. స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హోదాలో విద్యాశాఖ కమిషనర్ డైరెక్టర్‌గా వ్యవహరించేవారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఇదే తరహా విధానం అమల్లో ఉన్నది. దీనికి భిన్నంగా సర్కారు ఇటీవలే ఎస్‌ఎస్‌ఏ నూతన డైరెక్టర్‌ను నియమించింది. అయితే ఇతరశాఖలో పనిచేసే అధికారిని తీసుకొచ్చి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమించడాన్ని విద్యాశాఖలోని ఇతర అదనపు డైరెక్టర్లు తప్పుపడుతున్నారు. తాముండగా, మరోశాఖలోని అదనపు డైరెక్టర్‌ను తీసుకొచ్చి ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించడమేంటని బాహాటంగానే విమర్శిస్తున్నారు.

డీఈవోలు మాట వింటారా?

సమగ్రశిక్ష ప్రాజెక్టుకు జిల్లా స్థాయిలో అధికారులు లేరు. గతంలో ప్రాజెక్ట్ అధికారులుండగా (పీవో), వీరిని తొలగించి ప్రస్తుతం ఈ బాధ్యతలను డీఈవోలకే అప్పగించారు. డీఈవోలంతా విద్యాశాఖ కమిషనర్ ఆధ్వర్యంలో పనిచేస్తారు. ఇది వరకు ఎస్‌ఎస్‌ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాధ్యతలను కమిషనర్లే నిర్వర్తించడంతో పనులు చకా చకాసాగేవి. కానిప్పుడు రెండు పడవల మీద ప్రయాణం చందాన.. ఇటు కమిషనర్, అటు ప్రాజెక్ట్ డైరెక్టర్లిద్దరి ఆదేశాలను డీఈవోలు పాటించాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో ఇదే సాధ్యమయ్యేపనేనా? అన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో విద్యాశాఖ పాలన గాడి తప్పుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.